క్లుప్తంగా

మొక్కలు నాటాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): వాతావరణలో సమతుల్యత లోపించకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రంజీ క్రికెటర్ నరేంద్ర అన్నారు. శుక్రవారం ఎంపీపీ ఆవరణలో ఎంపీపీ, సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని హరించి ప్రాణవాయువును ఇచ్చే మొక్కల వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఇంటి పరిసరాలు, రోడ్ల పక్కన, ఇతర ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని కోరారు.

సర్వీస్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని..



డీఈఈ నర్సింహులుకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

జహీరాబాద్ టౌన్: రైల్వే గేటు వద్ద దెబ్బతిన్న సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు ఆర్అండ్‌బీ డీఈఈ నర్సింహులుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ముందుగా నాయకులు దెబ్బతిన్న సర్వీస్ రోడ్డు పరిశీలించారు. రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన నడుస్తున్నాయన్నారు. డీఈఈ స్పందించి, ఒకటి రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తానన్నారు.

జాతరను ఘనంగా జరుపుకోవాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జిన్నారం(పటాన్‌చెరు): అలీ అబ్బాస్ జాతర ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలం మంబాపూర్‌లో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలీ అబ్బాస్ జాతర ఉత్సవాలను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ యేడు కూడా ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, నాయకులు దయానంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని పెద్దమ్మ ఆలయంలో బోనాల వేడుకలను శుక్రవారం భెల్ ఈడీ కేబీ రాజాతో కలిసి భెల్ ఫైనాన్స్ డైరెక్టర్ ఆర్‌కే ద్వివేది ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. పరిశ్రమలో జరిగిన ముఖ్య సమావేశంలో పాల్గొన్న భెల్ సీఎండీ కేఎస్ మూర్తి కూడా పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈడీ పీఈఅండ్‌ఎస్‌డీ శ్రీనివాస్‌రావు, జీఎం (హెచ్‌ఆర్) ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ నిరసన

సదాశివపేట(సంగారెడ్డి): వర్షాల కారణంగా ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతలను అధికారులు వెంటనే పూడ్చాలని పట్టణ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. మోమిన్‌పేటకు వెళ్లే ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడారు. మోమిన్‌పేట రోడ్డు గుంతలమయంగా మారిందని, సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల స్పందించి వాటిని పూడ్చి వేయాలన్నారు. నాయకులు సాయి, హాజీ, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని పలు రహదారుల్లో శుక్రవారం చిరాగ్‌పల్లి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. పలు వాహన చోదకులకు జరిమానాలు వేశారు.

బోనం ఎత్తిన తహసీల్దార్



చాంద్రాయణగుట్ట: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి శుక్రవారం భక్తుల తాకిడి నెలకొంది. సంగారెడ్డి తహసీల్దార్ షేక్ ఫర్వీన్ అమ్మవారికి బోనం సమర్పించారు.

కుక్కల బెడదను అరికడతాం

కుక్కలను పట్టుకునేందుకు సిబ్బందిని పంపించి వాటిని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ ఉమ అన్నారు. ఖాళీ స్థలాల్లో వర్షం మురుగు నిల్వ ఉంటే దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని, పారిశుద్ధ్యానికి ప్రాధానమిస్తామని చెప్పారు. తన చాంబర్‌లో శుక్రవారం సాక్షి ఫోన్ ఇన్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది.

–సదాశివపేట (సంగారెడ్డి)

- దోమలను నివారించేందుకు ఫాగింగ్ చేయిస్తాం
- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- ఫోన్ ఇన్‌లో మున్సిపల్ కమిషనర్ ఉమ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఉమ

ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. పట్టణ ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలి. నీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలి. జలుబు, దగ్గు, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి అని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

సిద్దాపూర్ కాలనీ ఇళ్ల పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉంటుంది. మోనా ప్లే పాఠశాల ప్రాంతంలో, 21వ వార్డులో కుక్కల బెడద ఎక్కువైంది? గురునగర్ కాలనీలో 50 గుంపులు సంచారిస్తున్నాయి?

– ఎం. తాజొద్దీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి, రాజేశ్ వార్డు వాసి, కరుణాకర్ గురునగర్ కాలనీ

కమిషనర్: పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉన్న కుక్కలను పట్టుకుని ఏబీసీ వ్యాక్సినేషన్ వేస్తున్నాం. మురుగు పారుదలకు చర్యలు చేపడుతాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశిస్తాం.

మోనా ప్లే పాఠశాల ప్రాంతంలో మొబైల్ టవర్ నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు?

– పిచార్యాగడి శివకుమార్, స్థానికుడు

క : ప్రస్తుతం మొబైల్ టవర్ నిర్మాణ పనులు నిలిపేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదికను పంపించాం.

సంగమేశ్వర మందిర ప్రాంతంలో మిషన్ భగీరథ పనులు కోసం తవ్విన గుంతలు పూడ్చలేదు?

– జనార్దన్‌రెడ్డి, 20వ వార్డు

క : ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించి గుంతలను పూడ్చి వేయిస్తాం. వర్షం నీరు నిల్వకుండా చర్యలు చేపడతాం.

ప్లాట్లు, స్థలాల్లో పిచ్చి మొక్కలు, వర్షం నీరు నిల్వతో అపరిశుభ్రత వాతావరణం?

–జయమ్మ, సత్యసాయి పాఠశాల ఇన్‌చార్జి

క : పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తిస్తాం. సదరు యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. పిచ్చి మొక్కలను తొలగింపజేసేలా ఆదేశాలిస్తాం. మురుగు నిల్వ కుండా చర్యలు తీసుకుంటాం.

కుమ్మరికేరీలోని ఖాళీ స్థలంలో ఉన్న మంజీరా పైప్‌లైన పగిలిపోయింది? డ్రైనేజీ నీరు కలుస్తోంది?

– కుమ్మరి ఆకాశ్, 16వ వార్డు

క: సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం.

మజీద్ కూడలి వద్ద మురుగు నిల్వ ఉంది?

– పురాన్‌సింగ్, మాజీ కౌన్సిలర్

క: నిలిచిన నీరు గురించి విచారిస్తాం. ఇక నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం.

డబుల్ రోడ్డు నిర్మాణంలో జాప్యం ఎందుకు?

– శశిమోహన్‌గౌడ్, 21వ వార్డు

క: సిద్దాపూర్ కూడలి నుంచి మటన్ మార్కెట్ దుకాణం వరకు నిర్మించాల్సిన రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభిస్తాం.

చికెన్ వ్యర్థాలను తైబజార్ వేలం నిర్వహించి మున్సిపల్‌కు ఆదాయం సమకూర్చాలి?

– వెంకటేశం, సదాశివపేట

క: చికెన్ వ్యర్థాల తరలింపు గురించి సంబంధిత అధికారులతో చర్చిస్తాం. ఈ విషయమై కూడా సమాలోచన చేస్తాం.

బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారులతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి : బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అందజేశారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సదాశివపేటకు చెందిన 13 మందికి రూ.4,47 లక్షలు, సదాశివపేట మండలానికి చెందిన ఏడుగురికి రూ.2.11లక్షలు, కొండాపూర్ మండలానికి చెందిన 14 మందికి రూ.3.70 లక్షలు, కంది మండలానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు రూ.1.06 లక్షలను బాధిత కుటుంబసభ్యులకు అందించారు. అలాగే సంగారెడ్డి పట్టణానికి చెందిన ఒకరికి రూ.22,500లు, సంగారెడ్డి మండలానికి చెందిన ముగ్గురికి రూ.75,500, ఇతర ఇద్దరికి రూ.22,000 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరిరెడ్డి, శివరాజ్ పాటిల్, చింతా గోపాల్, పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మ్యాకం విఠల్, చక్రపాణి, పట్టణ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు పాండు, రుక్మొద్దీన్, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొడవే

దారి దోపిడీ కాదు : సీఐ మహేశ్‌గౌడ్

సదాశివపేట(సంగారెడ్డి): దారీ దోపిడీ అంటున్న వార్త వాస్తవం కాదు..అది కేవలం ఇరు వర్గాల మధ్య మద్యం మత్తులో జరిగిన గొడవేనని సీఐ మహేశ్ గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కారులో హైదరాబాద్‌కు చెందిన సంపత్, సుమన్, కృష్ణ జహీరాబాద్‌లో బంధువుల ఇంట్లో రాత్రి విందుకు హాజరై తిరిగి అదే రాత్రి బయలుదేరారు. శుక్రవారం తెల్లవారుజాము 2.30 గంటల సమయంలో పట్టణ పరిధిలోని 65వ నంబర్ జాతీయ రహదారి ఎస్ఎన్ ఫుడ్ కోర్టు పక్కనున్న పెట్రోల్ పంపు సమీపాన వాహనం సిగరెట్ తాగుతున్నారు. ఎక్కడి నుంచో ఇద్దరు స్కూటిపై వచ్చి సిగరెట్ ఉందా? అని అడిగారు. ఇరువర్గాల వారు తాగి ఉండటంతో మత్తులో ఒకరినొకరు దూషించుకున్నారు. ఎక్కడి నుంచి వస్తున్నారు ఎక్కడికిపోతున్నారు లోకల్ వాళ్లు అడిగితే చెప్పాలంటూ వివాదం మొదలైంది. ఆ ఇద్దరు ఫోన్ చేసి నలుగురిని పిలిపించారు. ఈ ఆరుగురు ఆ ముగ్గురి మధ్య గొడవ జరిగింది. దాన్ని సుమన్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండటంతో ఆగ్రహంతో వీరు లాక్కునే క్రమంలోఅతడి మెడలోని 3 తులాల బంగారం కింద పడిపోయింది. ఇదే సమయంలో సంగారెడ్డి వైపు నుంచి పెట్రోలింగ్ వాహనం రావడంతో పారిపోతున్న ఆరుగురిలో ఇద్దరిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నాయని సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **పాపమ్మ అమ్మవారికి పూజలు**

మునిపల్లి(అందోల్): పాపమ్మ అమ్మకు భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆపై నైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

◆ **28న దుర్గమ్మ జాతర**

మునిపల్లి(అందోల్): మునిపల్లి మండలం తాటిపల్లిలో దుర్గమ్మ జాతర 28న నిర్వహిస్తున్నామని గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. గ్రామంలోని భక్తులందరూ ఆరోజు దేవాలయంలో నిర్వహించే పూజా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

◆ **బీజేపీ నిరసన**

నారాయణఖేడ్: రాష్ట్ర బడ్జెట్‌తో తెలంగాణకు ఒరిగేదేమిలేదంటూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన తెలిపారు. రాజీవ్ కూడలిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. బడ్జెట్లో రాష్ట్రానికి ఇచ్చింది గాడిద గుడ్డేనని విమర్శించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, ముఖ్యనాయకులు సాయిరాం, నగేశ్ యాదవ్, రాజుగౌడ్, దశరథ్ పాల్గొన్నారు.

◆ **కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా వీర కృష్ణారెడ్డి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మద్దికుంట గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు వీరకృష్ణారెడ్డి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు గోదావరికి, జిల్లా సీనియర్ నాయకులకు, రాజేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి**

వటపల్లి(అందోల్): రైతు బీమా పథకాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ విజయరత్న సూచించారు. శుక్రవారం అందోల్ మండలం కొడెకల్, మాసాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి, అక్సాన్‌పల్లిలలో రైతు బీమా పథకం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జూన్ 28, 2024 లోపు పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులతో పాటు గతంలో దరఖాస్తు చేసుకోనివారు కూడా చేసుకోవచ్చన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న రైతులు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతులు తమ ఆధార్, నామినీ ఆధార్, పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలతో పాటు దరఖాస్తు ఫారంతో ఏఈఓలను కలవాలన్నారు. ఆగస్టు 4 వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీనివాస్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఎన్నికలకు సిద్ధం కావాలి**

నారాయణఖేడ్: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు యువత సిద్ధం కావాలని బీజేపీ ఖేడ్ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఖేడ్ పార్టీ మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్ అధ్యక్షతన పార్టీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. కో–కన్వీనర్ నగేశ్ యాదవ్, ఇతర బాధ్యులు ప్రశాంత్, సిద్ధయ్యస్వామి, సచిన్‌పాటిల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ **తహసీల్దార్ బదిలీ**

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ తహసీల్దార్ జి.వెంకటేశ్వర్లు బదిలీ అయ్యారు. ఆ మేరకు శుక్రవారం కలెక్టర్ క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్నా వెంకటేశ్వర్లు శిక్షణలో భాగంగా మార్చిలో కల్హేర్ తహసీల్దార్‌గా వచ్చారు. ఐదు నెలలు శిక్షణ పూర్తి కాగా సీసీఎస్ఏకు బదిలీ చేశారు. ఆ స్థానంలో కల్హేర్ తహసీల్దార్‌గా రమదేవిని నియమించినట్లు సమాచారం.

◆ **సీఐగా శివలింగం**



జహీరాబాద్: టౌన్ సీఐగా శివలింగం నియమితులయ్యారు. ఆ స్థానంలో పనిచేసిన రవి బదిలీ అయ్యారు. శివలింగం గతంలో జహీరాబాద్ టౌన్ ఎస్ఐగా పనిచేశారు. రూరల్ సీఐగా పనిచేసిన నయిూమొద్దీన్ సైతం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జక్కుల హనుమంతు నియమితులయ్యారు. ఆ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లోని బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి సూచించారు. పార్టీ గుమ్మడిదల మండల కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో పార్టీ బలోపేతంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన చర్చించారు.

వ్యక్తి అదృశ్యం



ఎం. బాబూరావు

జిన్నారం(పటాన్‌చెరు): కూలి పనికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన బొల్లారంలో జరిగింది. సీఐ గంగాధర్ కథనం ప్రకారం... జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో గల లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న ఎం. బాబూరావు ఓ ప్రైవేటు పరిశ్రమలో కూలి పని చేసేందుకు ఈనెల 21న వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, తెలిసిన వ్యక్తుల వద్ద అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సీఐ దర్యాప్తు చేస్తున్నారు.

పోచమ్మకు బోనాలు

నారాయణఖేడ్: పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఉన్న ముత్యాలపోచమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు. మహిళలు తలలపై బోనాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

బ్లూ క్రాస్ సహకారం తీసుకుంటాం

- అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



కుక్కల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి తదితరులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల సంరక్షణ, కట్టడికి బ్లూ క్రాస్ హైదరాబాద్ సంస్థ సహకారంతో ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బ్లూ క్రాస్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుక్కల సంరక్షణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు, జంతు ప్రేమికురాలు అమలతో వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ నిర్మాణం, గాయపడ్డ కుక్కలకు చికిత్స, స్టెరిలైజేషన్, సంరక్షణ, తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపైన సంస్థ బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల కట్టడికి ఇప్పటికే చర్యలు చేపట్టామని చైర్మన్ తెలిపారు. రాబోయే రోజుల్లో బ్లూ క్రాస్ హైదరాబాద్ సంస్థ సహకారంతో వీధి కుక్కల సంరక్షణకు చర్యలు చేపట్టబోతున్నట్లు తెలిపారు.

సీపీఎస్ రద్దు చేయాలి



సభ్యత్వ నమోదు పత్రాలతో పీఆర్‌టీయూ నేతలు

జోగిపేట(అందోల్): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేయాలని పీఆర్‌టీయూ పత్రికా సంపాదకవర్గ సభ్యుడు మాణయ్య కోరారు. శుక్రవారం సభ్యత్వ నమోదును జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. 20 వేల ప్రమోషన్లు, బదిలీలు పట్టుపట్టి , పైగా కోర్టు కేసులు ఎదుర్కొని పూర్తి చేయించిన ఘనత పీఆర్‌టీయూదేనని అన్నారు. ఇంకా జోగిపేట బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, జోగిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పోసానిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రిక్షా కాలనీ పాఠశాలల్లోనూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో అందోల్ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.నరోత్తంకుమార్, ప్రధాన కార్యదర్శి బి.రాజమల్లు రాష్ట్ర బాధ్యులు మంజ్యానాయక్, సంగారెడ్డి జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జి.అనిల్‌కుమార్, జిల్లా బాధ్యుడు పి. సుభాశ్, వి.బి.శ్రీనివాస్, కృష్ణయ్య, త్రినాథ్ రావులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఓ అంకెల గారడీ

టీఎస్ఎస్‌సీడీసీ మాజీ చైర్మన్ నరోత్తం

జహీరాబాద్ టౌన్: ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తదనం ఏమిలేదని, కేవలం ఇది అంకెల గారడేనని టీఎస్ఎస్‌సీడీసీ మాజీ చైర్మన్ నరోత్తం అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు 13 హామీలపై బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. గతం ప్రభుత్వం కన్నా తక్కువ నిధులను కేటాయించారని ఆరోపించారు. విద్యా కమిషన్ ఏర్పాటుపై స్పష్టత లేదన్నారు. మహిళలకు రూ.2500 పింఛన్, ఆసరా పింఛన్ పెంపుదల గురించి ప్రస్తావన లేదన్నారు. బీజేపీ అధికార ప్రతినిధి బక్కయ్య గుప్తా మాట్లాడుతూ, జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్‌కు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులేవీ? అని అడిగారు. నిరుద్యోగ భృతి గురించి ప్రస్తావించలేదన్నారు. కేవలం అంకెల గారడీతో ప్రజలను మభ్యపెట్టె ప్రయత్నం జరిగిందన్నారు. ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడారు. సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఎక్కడ కూడా స్పష్టత లేదన్నారు. దళితులకు అన్యాయం జరిగిందన్నారు. రైతులు, పేదలను మధ్యపెట్టిందన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



జహీరాబాద్ టౌన్: మొక్కల కుండీలో ఉన్న నీటిని పారబోస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

నారాయణఖేడ్: పురపాలిక పరిధిలోని పలు వార్డులోని ఇళ్లల్లో పూలకుండీల్లో, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయాలని పురపాలిక చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, ఉపచైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే.. డ్రైడేలో భాగంగా పరిశుభ్రతను పాటించండి.. వ్యాధులను నిర్మూలించండి నినాదంతో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వారు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్లలో నీటి నిల్వలుంటే దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకుగాను ఆయా వార్డుల్లోని మురుగు కాల్వలు, ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిలో రసాయన ద్రావణాన్ని పిచికారీ చేశారు. పలువురు కౌన్సిలర్లతో పాటు పారిశుద్ధ్య పర్యవేక్షకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి శుక్రవారం అందరూ డ్రై డే పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించి ఇళ్లలో వాడే పూల కుండీలను పరిశీలించి నిల్వ ఉన్న నీటి పారబోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇళ్లలో వాడే కుండీలలోని నీటిని రెండు రోజులకొకసారి మార్చాలన్నారు. ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉంచకుండా చూడాలన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేయాలన్నారు. అనంతరం పలు వార్డుల్లో పర్యటించి రోడ్లు, మురుగు కాలువలను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌స్పెక్టర్ సంధ్యారాణి, సిబ్బంది రవీందర్‌రెడ్డి ఉన్నారు.

రాయికోడ్(అందోల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ ప్రజలకు సూచించారు. మండలంలోని అల్లాపూర్, శంశోద్దీన్‌పూర్‌లలో ఎంపీడీఓ ఎం ఎం.షరీఫ్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి స్థానిక పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డేలో భాగంగా పాత్రలను శుభ్రం చేసుకుని ఎండకు ఆరబెట్టుకోవాలని మహిళలకు తెలిపారు. రాయికోడ్ పీహెచ్‌సీని సందర్శించి పరిసరాలను పరిశీలించారు.

కొత్తూర్(బి) సందర్శన

జహీరాబాద్ టౌన్: మండలంలోని కొత్తూర్(బి)ను శుక్రవారం డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవి సందర్శించారు. ఆరు డెంగీ కేసులు నమోదు కావడంతో ఇటీవల గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ మేరకు ఆమె గ్రామాన్ని సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఇక్కడ నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సందర్శించారు. వైద్యసిబ్బందితో మాట్లాడి గ్రామ పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నలుగురికి నయమైందని, మరో ఇద్దరి రిపోర్టు రావల్సి ఉందని వైద్య సిబ్బంది వివరించారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

జహీరాబాద్: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావును కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డిలు మాణిక్‌రావును పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అరుణ్‌లు ఉన్నారు.



జహీరాబాద్ టౌన్: అమర్ జవాన్ స్తూపం వద్ద అమరులకు నివాళులు అర్పిస్తున్న మాజీ సైనికులు



నారాయణఖేడ్‌లో..

జవాన్‌ల త్యాగం చిరస్మరణీయం

జవాన్‌ల త్యాగం మరువలేనిది అని మాజీ సైనికులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సేవా సంఘాల నేతలు, అధికారులు అన్నారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా అమరులైన జవాన్‌లకు నివాళులర్పించారు. శుక్రవారం ఆయా ప్రాంతాల్లో అమరుల స్తూపాల వద్ద శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

–నెట్‌వర్క్